సాక్షి
తిరుపతి

బుధవారం । 17 । జనవరి । 2024



కిక్కిరిసిన నేలపట్టు

దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రం పర్యాటకులతో కిక్కిరిసింది. విహంగాలను వీక్షిస్తూ పరవశించారు. - 8లో



పౌరుషం 'కనుమ'

పాకాల, రామచంద్రాపురం మండలాల్లో జరిగిన పరుష పందేలకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. - 8లో



దేవతలారా..రండి!

బ్రహ్మోత్సవాల్లో జరిగే తమ కల్యాణానికి సకల దేవతలను ఆహ్వానిస్తూ శివపార్వతులు గిరిప్రదక్షిణ నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

పశువుల పండగ



గోవులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవారి ఆలయం ముందు దేవస్థానానికి సంబంధించిన గోవులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ జనార్దన్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

పితృస్మరామి!



దర్పణాలు వదులుతున్న కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: పెద్దలను స్మరించుకునే మకర సంక్రాంతి నాడు తమ కుటుంబ పెద్దలకు పితృదర్పణం చేసేందుకు కుటుంబ సభ్యులతో సోమవారం కపిలతీర్థం పోటెత్తింది. చనిపోయిన కుటుంబ పెద్దలకు మకర సంక్రాంతి నాడు పితృదర్పణం, పిండప్రదానం చేసి స్మరించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం మకర సంక్రమణ పుణ్యకాలం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పితృదర్పణం చేసేందుకు ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కపిలతీర్థానికి చేరుకున్నారు. దీంతో కపిలతీర్థం జనంతో కిక్కిరిసింది.

రేపటి నుంచి జాతీయ వర్క్‌షాప్

తిరుపతి అర్బన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి మూడు రోజులపాటు పంచాయతీ రాజ్ విభాగం నేతృత్వంలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు జేసీ శుభం భన్సల్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సుస్థిర అభివృద్ధి- లక్ష్యాల స్థానికీకరణ, హెల్త్- విలేజ్ అంశాలపై వర్క్‌షాపు జరుగుతుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రతినిధులు హాజరు కానున్నట్టు వెల్లడించారు. అనంతరం కార్యక్రమ నిర్వహణ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సమీక్షలో పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్, డీఆర్ఓ పెంచల కిషోర్, జీఎం స్మార్ట్ సిటీ చంద్రమౌళి, ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో మానవహారం

తిరుపతి అర్బన్: సామాజిక సమతా సంకల్పంలో భాగంగా బుధవారం తిరుపతి ఆర్టీసీ సర్కిల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 10గంటలకు మానవహారం చేపట్టనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. విజయవాడలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహా విష్కరణ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు కార్యాక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే బుధవారం మానవహారం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలకు దూరంగా ఉండాలని కడప జోన్ ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించరాదని, ఎట్టిపరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ మాట్లాడరాదని తెలిపారు. ఓవర్ ట్రాక్ చేసే సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, జిల్లా కార్గో ఇన్‌చార్జి సురేంద్రబాబు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న పలకలతో స్థానికులు



పొగరు గిత్తలను ఒడిసిపడుతున్న యువకులు



జనసంద్రమైన రంగంపేట

రంకెలేసిన పౌరుషం

ఘనంగా ఎడ్ల పందేలు

- దూసుకొచ్చిన కోడెగిత్తలు
- నిలువరించిన యువత
- జనసంద్రంగా మారిన ఏ.రంగంపేట
- పరుష పందేలను తిలకించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- పలకలు దక్కించుకుని పండగ చేసుకున్న యువకులు

చంద్రగిరి: రంకెలేస్తూ దూసుకొచ్చే పోట్ల గిత్తలు.. కాలు దువ్వుతూ పోట్లాటకు సిద్ధమైన యువకులు.. మదపుటెద్దులను లొంగదీసుకుని కేరింతలు.. కొమ్ములకు కట్టిన పలకలు దక్కించుకుని సంబరాలు.. వీటన్నిటినీ వీక్షించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన జనాలు.. ఇదీ చంద్రగిరి మండలం, ఎం.రంగంపేటలో కనిపించిన దృశ్యాలు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం పశువుల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. యజమానులు పశువుల కొమ్ములకు రంగులు అద్ది, నడుముకు నల్లరిబ్బన్లు కట్టి చూడచక్కగా ముస్తాబు చేశారు. అనంతరం పశువుల కొమ్ములకు పలకలు కట్టి పందేలకు వదిలారు. దూసుకొస్తున్న పశువులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. పోట్ల గిత్తలను లొంగదీసుకుని విజయగర్వంతో ఉర్రూతలూగారు. కొమ్ములకు కట్టిన పలకలను దక్కించుకుని సంబరాల్లో మునిగితేలారు. పరుష పందేలను చూడడానికి రాష్ట్ర నలుమూలల నుంచి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు, ఎంపీటీసీ భోస్ చంద్రారెడ్డి సుమారు 60 పట్టీలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చిత్రాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పనపాకం, పుల్లయ్యగారిపల్లిలో జరిగిన ఎడ్ల పందేలకూ జనం పోటెత్తారు. చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొని పరుషపందేలను వీక్షించారు. అక్కడి నుంచి ఏ.రంగంపేటలో నిర్వహించిన ఎడ్ల పందేరాలకు విచ్చేసి యువకులను ఉత్సాహపరిచారు. అనంతరం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా వుండగా పశువులను నిలువరించే క్రమంలో కొందరు యువకులకు గాయపడ్డారు. వారిని హుటాహుటిన 108లో తిరుపతి రుయాకు తరలించారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



రంకెలేస్తూ..దుసుకొస్తున్న పోట్లగిత్తలు



మేడలెక్కిన ఉత్సాహం



ఉరకలేస్తున్న పశువులు



పరుగులు తీస్తున్న ఎడ్లను నిలువరిస్తున్న యువకులు



కోడెగిత్తల హుషారు



నవరత్నాలు, పార్టీనేతలతో ఏర్పాటు చేసిన పలకలు

భక్తి పారవశ్యం.. మకరజ్యోతి దర్శనం



తిరుఆభరణాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



తిరుఆభరణాల అలంకారంలో అయ్యప్పస్వామి



ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మకరజ్యోతిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. జ్యోతి దివ్యదర్శనం కాగానే అయ్యప్ప నామ స్మరణలతో ఆలయ పరిసర ప్రాంతాలు మారుమోగాయి. అంతకు ముందు స్థానిక సదుమమ్మ ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తిరుఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆభరణాలను మంత్రి కేరళ వాయిద్యాలు, ప్రత్యేక గొడుగుల నడుమ ఊరేగింపుగా అయ్యప్ప సన్నిధానానికి చేరుకున్నారు. పడిమెట్ల మీదుగా వెళ్లి స్వామివారికి సమర్పించారు. తిరువాభరణాలు అలంకరించిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నంబూద్రి నారాయణన్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయానికి తూర్పు దిక్కున ఉన్న కొండల్లో సాయంత్రం 6.45 గంటలకు భక్తులకు స్వామివారి మకరజ్యోతి దర్శనం కలిగింది. జ్యోతి దర్శనం అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణమంతా కర్పూర జ్యోతులు వెలిగించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలతమ్మ, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కృష్ణమూర్తి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నిశాంత్‌రెడ్డి, జింకా చలపతి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణంలో అర్చకులు

తిరుపతి కల్చరల్: టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలోని మైదానంలో సోమవారం రాత్రి శ్రీగోదాదేవి కల్యాణం కన్నుల పండువగా సాగింది. ముందుగా శ్రీకృష్ణస్వామి, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అర్చక స్వాములు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికకు వేంచేపు చేశారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన గోదా కల్యాణం నృత్య రూపకం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రఘునాథ బృందం సుమధురంగా అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు విశేష పూజల అనంతరం మంగళ వాయిద్యాల నడుమ వైభవోపేతంగా మాంగల్య ధారణ నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ వ్యాఖ్యానితగా వ్యవహరించారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఎస్వీ వేది విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాణిసదాశివ మూర్తి, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్‌కుమార్ శ్రీవారి డెప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ దీక్షితులు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ ఉమా ముద్దుబాల పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ధ్వజస్తంభం వద్ద జస్టిస్ సెంథిల్‌కుమార్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణమూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

దేవతలారా..రండి!

- వైభవంగా కైలాస గిరిప్రదక్షిణ
- తమ కల్యాణానికి సకల దేవతలను ఆహ్వానించిన శివ,పార్వతులు



పుర ప్రదర్శనలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ రామారావు



శివపార్వతుల గిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో మంగళవారం గిరిప్రదక్షిణ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలిసిన శివపార్వతులకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా స్వామి, అమ్మవార్లు ప్రతి ఏటా కనుమ పండుగ రోజు కైలాస గిరిప్రదక్షిణగా వెళ్లి దేవతలు, రుషులను ఆహ్వానిస్తారు. ఇందులో భాగంగా మొదట జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఉత్సవమూర్తులను చప్పరాలపై అధిష్ఠింపజేసి కైలాసగిరి ప్రదక్షిణకు సాగనంపారు. స్వామి, అమ్మవార్లకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. జయరాంరావువీధి, కైలాసగిరికాలనీ, రామచంద్రాపురం, రాజీవ్‌నగర్ మీదుగా రామాపురం రిజర్వాయరు సమీపంలోగల అంజూరు మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు వేయిలింగాలకోన, వేడం మీదుగా శుకబ్రహ్మాశ్రమం వద్ద గల ఎదురుసేవా మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆలయానికి వేంచేపు చేశారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో రామారావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.



అన్నదానంలో చైర్మన్, ఈఓ

బహిరంగ ప్రకటన

మెస్సర్స్ సెంచరీ అడ్హెసివ్స్ & కెమికల్స్ వారు 4.56 ఎకరాల విస్తీర్ణం యందు ప్లాటు నెం.49(బ్లాక్-సి) సర్వేనెం.32పి, 33పి, 289పి, 290పి, 291పి, 292పి, ఏపిఐఐసి పరిశ్రమల స్థలము, కోనేటిరాజుపాళెం గ్రామం నాయుడుపేట మండలం, తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ నందు పర్యావరణ అనుమతులు యొక్క ఆర్డర్ నెం. **SEIAA/AP/IND/TPTY/4/2023/5029/232.28/231.18** తేది: 24.12.2023న ఫినాల్ ఫార్మాల్డిహైడ్ మరియు మెలమైన్ ఫార్మాల్డిహైడ్ రెసిన్ ఉత్పత్తి కోసం పొందియున్నారు. ఆ ప్రతులు పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (MoEF&CC) వెబ్‌సైట్ నందు లభించును

సం॥ మెస్సర్స్ సెంచరీ అడ్హెసివ్స్ & కెమికల్స్ లిమిటెడ్

నాలుగు తరాల నడుమ జయంతి

- ఒకే వేదికపై మరో మూడు వేడుకలు
- మానవ సంబంధాలకు అద్దం పట్టిన కలయిక



జయంతి వేడుకల్లో కొడుకులు, కుమార్తెలు, అల్లుళ్లు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు

తిరుపతి డెస్క్ : ఆ తండ్రికి మంగళవారం శతజయంతి వేడుకలతోపాటు పెద్దకుమారుడి వివాహ వార్షికోత్సవం, మనవరాలికి లంగా ఓణీ ధారణ, మునిమనవడి పుట్టినరోజు వేడుకలు..ఇలా ఒకే వేదికపై మంగళవారం నిర్వహించి వసుధైక కుటుంబం అనిపించారు. ఐదుగురు కొడుకులు, ఐదుగురు కుమార్తెలు, 19మంది మనవలు, మనవరాళ్లు, 9మంది మునిమనవలు, మునిమనవరాళ్ల సందడి నడుమ ఈ వేడుకలకు తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలోని ఒక ఫంక్షన్ హాల్ వేదికైంది. వివరాలు..పాకాలకు చెందిన విశ్రాంత రైల్వేగార్డు స్వామిదాస్ 89 ఏళ్ల వయస్సులో కన్నుమూశారు. ఆ తర్వాత కాలంలో ఆయన సతీమణి, విశ్రాంత టీచర్ డోరతి కూడా మరణించారు. ఇద్దరికీ వృత్తిపరంగా పాకాలలో ఎంతో మంచి పేరుంది. వారి పెద్దకుమారుడు శామ్యూల్(73) రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌గా, అలాగే రెండవ కుమారుడు డేనియెల్ తిరుపతిలోని ఆంధ్రాబ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. మిగిలిన ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు సైతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ కొందరు రిటైర్డ్ అయ్యారు. ఈ పదిమందికి కుమారులు, కుమార్తెలు కలిపి మొత్తం 17మంది ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు కూడా చేశారు. మూడో తరం నుంచి నాలుగవ తరానికి వచ్చేసరికి మునిమనవలు, మునిమనవరాళ్లు 9మంది ఉన్నారు. స్వామిదాస్ మూడు తరాలను చూశారు. ఈ బెటాలియన్ అంతా తెలంగాణ రాష్ట్రంతో, తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో జయంతి పేరిట అందరూ కలిశారు.

ఒక వేదికపై మరికొన్ని...

ఇదే కార్యక్రమంలో శామ్యూల్ తమ 43వ వివాహ వార్షికోత్సవం, 5వ కుమారుడైన ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత సైనికుడు ఎబినైజర్ కుమార్తె అనుష్కకోపి(12) లంగా ఓణీ వేడుక, పెద్దమనవడు ప్రశాంత్ కుమారుడు బెన్నీ అమోగ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

ముస్తాబైన కొండచుట్టు మండపం



రంగులు వేసిన కొండచుట్టు మండపం

నగరి : పట్టణంలో ఏటా కనుమ పండుగకు మరుసటి రోజున గిరిప్రదక్షిణ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జిల్లాలో మరెక్కడ లేని విధంగా 21 దేవతల ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా కొండ చుట్టు మండపం వద్దకు చేరుతాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వాహకులు మండపానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. మండపం చుట్టూ క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొండచుట్టు ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని నగరి డీఎస్పీ రవికుమార్ తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. మద్యం సేవించి గొడవలకు దిగే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

రేణిగుంట: రేణిగుంట-కడప రైల్వే మార్గంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ ఎస్‌ఐ రవి తెలిపారు. కోడూరు మార్గంలో రేణిగుంట మండలం, కరకంబాడి సమీపంలో రైలు పట్టాలపై 28ఏళ్ల యువకుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని వద్దనున్న ఆధార్ కార్డులో రాజ్‌బీర్ కుమార్(28)గా ఉన్నట్లు గుర్తించారు. అయితే మృతుని బంధువుల వివరాలు తెలియకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ వైద్యకళాశాలకు తరలించినట్లు ఆయన వివరించారు.

పొలాన్ని ఆక్రమించేశారు!

శ్రీకాళహస్తి: మండలంలోని తిమ్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మడి వెంకటయ్యపై టీడీపీకి చెందిన గుమ్మళ్లహరి, వెంకటకృష్ణయ్య దాడికి తెగబడ్డారు. ఈ మేరకు బాధితుడు మాట్లాడుతూ తాను 1987లో రామచంద్రయ్య అనే వ్యక్తి దగ్గర రూ.9 వేలకు ఓ స్థలాన్ని కొని సాగుచేసుకుంటున్నట్టు వెల్లడించాడు. అయితే ఆరు నెలల క్రితం రామచంద్రయ్య మరణానంతరం హరి, వెంకటకృష్ణయ్య తనకు అడ్డుపడి ఆ స్థలం తమదేనని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ విషయమై గత నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఆ తర్వాత మంగళవారం తన పొలంలో దున్నుతుండగా హరి, వెంకటకృష్ణయ్య దాడి చేశారని వాపోయాడు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

పాకాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరివేసుకుని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గుడార్లబండ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. సోమవారం అన్నమయ్యజిల్లా, నిమ్మనపల్లె మండలం, కొండసానివారిపల్లె గ్రామానికి చెందిన పీ.సురేష్(30) గుడార్లబండ గ్రామానికి సమీపంలోని అప్పరాజుకుంట కట్ట కింద చెట్టుకుని ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ కలహాలతోనే సురేష్ మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ మొగిలీశ్వర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పౌరుషం'కనుమ'

- అమ్మగారిపల్లిలో పరుష పందేలు



పోట్లగిత్తను నిలువరిస్తున్న యువకులు

పాకాల: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని మండలంలోని ఒబుశెట్టివారిపల్లిలో పరుష పందేలు నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ఎడ్లను సుందరంగా అలంకరించి బరిలో దింపి పరుగులు పెట్టించారు. యువత రెట్టించిన ఉత్సాహంతో ఎడ్లతో పోటీపడి పలకలు దక్కించుకుని విజయ గర్వంతో ఊగిపోయారు. కోడెగిత్తలను పట్టుకున్న వారికి తగిన పారితోషికం ఇస్తామని యజమానులు ప్రకటించడంతో పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

బొప్పరాజుపల్లిలో..

రామచంద్రాపురం: మండలంలోని బొప్పరాజుపల్లిలో పరుష పందేలు నిర్వహించారు. ఉదయం పశువుల కొమ్ములకు రంగులు పూసి కొయ్యతో చెక్కిన పలకలు, రంగు కాగితాలు, వివిధ రకాల దేవుళ్ల బొమ్మలను అతికించి, డప్పులు కొట్టి జనంలోకి వదిలారు. యువకులు వాటిని అడ్డగించి కొమ్ములకు ఉన్న బహుమతులను సొంతం చేసుకోవడానికి పోటీ పడ్డారు.



కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓ జనార్దన్‌రెడ్డికి నగదు అందిస్తున్న దాతలు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన కేతా రవికుమార్‌రెడ్డి, ధర్మపత్ని వసంతలక్ష్మి రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం మొత్తాన్ని ఈఓ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం





విరాళం అందజేస్తున్న దాత వెంకటరెడ్డి, దాత నీరజ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు వేర్వేరుగా విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన నీరజ అనే భక్తురాలు రూ.1.6 లక్షలు, కడప జిల్లా, ఎర్రగుంట్ల మండలానికి చెందిన వెంకటరెడ్డి రూ.1,00,116ను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ఏఈవో సతీష్‌మాలిక్ స్వీకరించారు. అనంతరం దాతలకు స్వామి,అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

కోడి పందెం స్థావరంపై దాడి

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని మంగళపూరు గ్రామ సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించినట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతోపాటు ఐదు బైక్‌లు, ఒక ఆటో, రూ.2,020 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

కిక్కిరిసిన నేలపట్టు

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల కేంద్రం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి సెలవుల కారణంగా రాష్ట్రంతోపాటు, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి మూడు రోజులుగా సందర్శకులు క్యూ కడుతున్నారు. ఎటు చూసినా చిన్నారుల ఆటపాటలు, విహంగాల విన్యాసాలు, కిలకిలరావాలతో సందడి నెలకొంది. విడిది చేస్తున్న విహంగాలను వీక్షించి పరవశించి పోతున్నారు. భోగి పండుగ నాడు అధికం సంఖ్యలో వాహనాలు రావడంతో పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.





విహంగాల విన్యాసాలను కెమెరాల్లో బంధిస్తున్న పర్యాటకులు



చెరువు నీటిలో ఈతాడుతున్న గూడబాతులు



వాచ్‌టవర్‌పై నుంచి విహంగాలను వీక్షిస్తున్న సందర్శకులు